క్లుప్తంగా

గ్రామీణులకు 104 వైద్య సేవలు


రోగులకు వైద్య చికిత్స అందిస్తున్న వైద్యాధికారులు

పర్చూరు (చినగంజాం): సుదూర ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్ళలేని గ్రామీణ ప్రాంత ప్రజలకు 104 ద్వారా పలు రకాలు వైద్య సేవలు అందిస్తున్నట్లు పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఏకాంబరేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని గోరంట్ల వారిపాలెం గ్రామంలో గర్భిణులు వివిధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలా మొదటి మంగళవారం అన్నంబొట్ల వారిపాలెం గ్రామం, రెండో శనివారం గర్నెపూడి, ఎడారుపల్లి గ్రామాల్లో, నాలుగో బుధవారం గోరంట్లవారిపాలెంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 104 సేవలను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది కె. లక్ష్మి, పవిత్ర, జి. అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ శేషుకుమారికి ఘన సన్మానం


ప్రిన్సిపాల్ శేషుకుమారిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

పర్చూరు (చినగంజాం): పర్చూరు బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషుకుమారికి కళాశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఇటీవల విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆమె ఉత్తం అధ్యాపకురాలిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అధ్యాపకులు రవికుమార్, బాబురావు, దీప, ధనలక్ష్మి, హనుమంతరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీ వద్దు


మార్టూరు పోలీస్ స్టేషన్లో మొక్క నాటుతున్న డీఎస్పీ రామాంజనేయులు, అధికారులు

మార్టూరు: పోలీసు అధికారులు కానీ.. సిబ్బంది కానీ శాంతి భద్రతలు కాపాడటంలో, ఫిర్యాదులు పరిష్కరించడంలో పారదర్శకంగా వ్యవహరించినప్పుడే ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతుందని బాపట్ల డీఎస్పీ పి. రామాంజనేయులు అన్నారు. మార్టూరు సర్కిల్ పోలీస్ స్టేషన్, యద్దనపూడి పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. మార్టూరు స్టేషన్లో అధికారులుతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిధిలో కేసుల వివరాలను అడిగి తెలుసుకుని.. కొబ్బరి మొక్క నాటారు. కార్యక్రమంలో మార్టూరు, సంతమాగులూరు, సీఐలు ఎం. శేషగిరి రావు, వెంకట్రావు, బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి పాల్గొన్నారు.

పోయాం.. మోసం!



> తమ్ముళ్లు మీరేం భయపడకండి.. మీలో బాగా చదువుకున్న వారు ఉన్నారు. మీకు నెలకు రూ.10 వేలు జీతం అందిస్తాం. వర్క్‌ఫ్రం హోం ద్వారా మీసేవలను ఉపయోగించుకుంటాం. అంతేకాదు నిరుద్యోగ భృతి కింది రూ. 3 వేలు అందిస్తాం.
>
> **సీఎం చంద్రబాబు నాయుడు ఈపడాది ఉగాది పంచాంగం శ్రవణంలో చెప్పిన మాటలు.**

> అసలు వలంటీర్ వ్యవస్థే లేదు. లేని పిల్లవానికి ఏమి పేరు పెట్టారు అన్నట్లు ఉంది.
>
> **- శాసన మండలిలో మంత్రి దోలా బాలా వీరాంజనేయస్వామి**

- కూటమి రాకతో వలంటీర్ల జీవనం దుర్భరం
- నమ్మిమోసపోయిన వలంటీర్లు
- కూలీలుగా మారుతున్న వలంటీర్లు
- ఇక వలంటీర్ వ్యవస్థ లేనట్లే?
- నెలకు పదివేలు గాలికే

నియోజకవర్గంలో వలంటీర్లు..

అద్దంకి టౌన్ 250	అద్దంకి రూరల్ 190	బల్లికురవ 235
కొరిశపాడు 196	సంతమాగులూరు 300	జే.పంగులూరు 224

అద్దంకి రూరల్:

నాలుక మడత పెట్టడం, అబద్ధాలను అలవోకగా చెప్పడం, విషప్రచారం చేయడంలో పీహెచ్‌డీ చేసిన వ్యక్తి ఎవరంటే అదే సీఎం చంద్రబాబు. ఎన్నికల ముందు ఒక హామీ.. తీరా గెలిచాక మేం ఎప్పుడు చెప్పాం అని ప్రజలను మోసం చేయడంలో ఘనుడు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు ఆదాయం సంపాదించే మార్గం చూపెడతాం, రూ. 10 వేలు జీతం ఇస్తాం అని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు చట్టసభల్లో వలంటీర్ వ్యవస్థే లేదనటం సిగ్గుచేటని వలంటీర్లు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి డోలాబాలా వీరాంజనేయస్వామి, ఇతర మంత్రులు ప్రకటన చేయడం వాళ్ల దిగజారుడుకు నిదర్శనమని ప్రజలు, మేధావులు పలువురు విమర్శిస్తున్నారు.

నమ్మి మోసపోయిన వలంటీర్లు..

ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటికి చేర్చుతూ ప్రజల్లో వైఎస్సార్ సీపీపై నమ్మకం భరోసా కలిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా ఎనలేని సేవ చేసి మంచిపేరు తెచ్చుకున్నారు. మొదటి నుంచి వలంటీర్లపై కూటమి ప్రభుత్వ నాయకులు విషం చిమ్ముతూనే ఉన్నారు. వలంటీర్ వ్యవస్థ పనితీరుపై బెంబేలెత్తిన టీడీపీ, జనసేన నాయకులు వారిపై లేనిపోని అభాండాలు వేశారు. అయినా ధైర్యం కోల్పోకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సహంతో ముందుకు నడిచారు. వలంటీర్లు వల్ల తమకు ముప్పు ఉందని గ్రహించిన కూటమి నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది వారిపై వల్లమాలిన ప్రేమను చూపుతూ మేము అధికారం చేపడితే నెలకు రూ. 10 వేలు ఇస్తాం, మీకు సంపాదించుకునే మార్గాన్ని చూపెడతాం. నెలకు రూ.50 వేలు సంపాదించేలా చేసి లక్షాధికారులకు చేస్తామని చంద్రబాబునాయుడు వలంటీర్లకు అరచేతిలో స్వర్గాన్ని చూపెట్టారు. ఇచ్చిన మాటలు నిజం కాదని అవసరానికి మాత్రమే వాడిన మాటలని అధికారం వచ్చాక కూటమి ప్రభుత్వం అసలు రంగు బయటపడింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన కథ నిజమైంది.

కూలీలుగా మారుతున్న వలంటీర్లు..

మాజీ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు గ్రామ, పట్టణాల్లో ప్రతి 50 గృహాలకు ఇక వలంటీర్ చొప్పున 2019 ఆగస్టు 15న విధుల్లోకి తీసుకున్నారు. ప్రధానంగా లబ్ధిదారుల ఇంటకి వెళ్లి ఫించన్లు అందించటం, బియ్యం పంపిణీతో పాటు ప్రజలకు, ప్రభుత్వ పరం కావాల్సిన అన్ని సేవలు అందించారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు ఎన్నటికి ప్రజలు మరువలేరు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 1395 మంది వలంటీర్లు విధులు నిర్వహించారు. వలంటీర్లు అందరూ మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావటంతో కూటమి ప్రభుత్వం రాకతో ఉద్యోగం పోయి, కుటుంబ పోషణ కష్టతరమైంది. చేసేది లేక కొందరు వ్యవసాయ కూలీలుగా, గమాస్తాలుగా, క్యాటరింగ్ పనులకు, టీ షాపుల్లో చెప్పుకోవటానికి కూడా సిగ్గుపడుతూ దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

ఇక వలంటీర్ వ్యవస్థ లేనట్లేనా ?

మొన్న జరిగిన అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని మంత్రులు చెప్పటంతో ఇక వలంటీర్ వ్యవస్థ లేనట్టేనని ముఖ్యమంత్రి చెప్పకనే చెప్పినట్టయింది. ఇంకా వలంటీర్‌లను మభ్యపెడుతూ సీఎం చంద్రబాబు నిజం చెప్పకుండా దాచటం ఎందుకని ప్రజలు భావిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన, ఉద్యమాలు చేపడతామని వలంటీర్లు హెచ్చరిస్తున్నారు.


ట్రాక్టర్ మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్న వలంటీర్ సైదా


వైద్యశాలకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)


కరోనా సమయంలో వృద్ధురాలికి మాస్క్ కడుతున్న వలంటీర్ (ఫైల్)

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్లకు రూ. 10 వేలు నెలకు వేతనం ఇస్తామని ప్రకటించింది. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి. వలంటీర్లు నిరసనలు, ఆందోళనల చేస్తున్నా ప్రభుత్వం స్పందించటం లేదు.

– భిక్షుల రమేష్‌బాబు, వలంటీర్, రామాంజనేయపురం

విస్మరించటం తగదు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించటం కూటమి ప్రభుత్వానికి తగదు. ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్లకు నెలకు రూ. 10 వేలు వేతనాన్ని ప్రకటించి విధుల్లోకి తీసుకోవాలి. ఉద్యోగం పోయి ఇబ్బందులు పడుతున్న వలంటీర్లకు జీవితాన్ని ఇవ్వాలి.

– జి. సంధ్య, వలంటీర్, ఆరికట్లవారిపాలెం

వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలి..



వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. గత ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనలో భాగంగా వలంటీర్ వ్యవస్థ తీసుకురావటంతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంత వరకు తీరింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా వలంటీర్లకు 10 వేలు వేతనాన్ని అందిస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని నెరవేర్చాలి.

– జ్యోతి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ, జిల్లా ఉపాధ్యక్షుడు

స.హ చట్టం బోర్డులో పేర్లు మార్చరా ?



స.హ చట్టం బోర్డులో నేటికీ పాత అధికారుల పేర్లతో ఉన్న బోర్డు

చీరాల టౌన్: అది మండల తహసీల్దార్ కార్యాలయం. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు, వారికి కావాల్సిన సమాచారం కోసం సమాచార హక్కు చట్టం దరఖాస్తులు అందిస్తుంటారు. అయితే చీరాల తహసీల్దార్ కార్యాలయం స.హ చట్టం బోర్డులో మాత్రం ఇంకా గతంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. పౌర సమాచార అధికారిగా ప్రస్తుతం డీటీ డి.అర్జున్ విధులు నిర్వహిస్తుండగా చీరాల నుంచి సంతమాగులూరుకు బదిలీ అయిన అప్పటి అధికారి పి.సురేష్ పేరు మార్చలేదు. అలానే మొదటి అప్పీలేట్ అధికారిగా గతంలో చీరాల ఆర్డీఓగా పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన పి.సరోజిని పేరు మాత్రం మార్చలేదు. ప్రస్తుతం చీరాల ఆర్డీఓగా టి.చంద్రశేఖర నాయుడు పనిచేస్తున్నా కానీ నేటి స.హ చట్టం బోర్డులో పాత అధికారి పేరు ప్రదర్శించడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రాధాన్యతమైన స.హ చట్టంలో పేర్లు కూడా మార్చలేక పోతున్నారా మండల అధికారులు అని ప్రజలు విమర్శిస్తున్నారు.

శునకాల స్వైరవిహారం


వల్లాపల్లిలో ప్రధాన రోడ్డులో అడ్డుగాన్న గ్రామ సింహాలు


బల్లికురవలో శునకాల గుంపు

బల్లికురవ: గ్రామ సింహాలు వీధుల్లో స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లోకి రావాలంటే భయపడుతున్నారు. గత ఆరు మాసాల్లో మండలంలో సుమారు 40 మంది వరకు కుక్క కాటుతో గాయాలపాలై వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. వల్లాపల్లి, పెద అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో గ్రామ సింహాల స్వైరవిహారం అధికంగా ఉంది. స్వైరవిహారానికి అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు అధికారులకు పాలకులకు విన్నవిస్తున్నా ఎలాంటి చర్యలు లేవన్నారు. కుక్కకాటుకు గురై వైద్యం చేయించుకునేందుకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నామని ఆయా గ్రామాల్లోని రమేష్, పవన్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామ సింహాలను గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అర్జీల విచారణ జాగ్రత్తగా చేయండి

చీరాల టౌన్: ప్రజలు, విద్యార్థులతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను జాగ్రత్తగా విచారణ చేయాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణ చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే రెవెన్యూ సేవలను అందరికి అందించాలన్నారు. భూ సమస్యలు, కుటుంబ ధ్రువీకరణ అర్జీల విచారణ నిష్పక్షపాతంగా చేయాలన్నారు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను అందించాలని తెలిపారు. సమావేశంలో డీటీ అర్జున్, సర్వేయర్ చార్లెస్, వీఆర్వోలున్నారు.

గోవులకు గ్రాసం అందజేత

చీరాల అర్బన్: చీరాలలోని శ్రీ భ్రమరాంబిక సేవా సమితి గో సంరక్షణలో భాగంగా గత ఆరు సంవత్సరాలుగా కార్తీక మాసంలో శ్రీశైలం దేవస్థానానికి గ్రాసం అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఒక లక్షా 2,516 రూపాయలు విలువ గల గ్రాసాన్ని దాతల సహకారంతో శ్రీశైలం దేవస్థాన ఈఓ చంద్రశేఖర అజాద్‌కు బుధవారం అందించారు. అలానే శ్రీకాళహస్తి దేవస్థానానికి సమితి ద్వారా లక్షన్నర రూపాయల విలువ గల 21 గరుకు స్తంభాలను తయారు చేసి శ్రీకాళహస్తి గోశాలకు, గో సంచార ప్రాంతాల్లో గరుకు స్తంభాలను పాతించారు. ఈ సందర్భంగా భ్రమరాంబికా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీఎస్ మహాలక్ష్మి, అబ్బరాజు శ్రీనివాసకుమార్, సమితి కో-ఆర్డినేటర్లు, సభ్యులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తి దేవాలయంలోని గోశాలకు అందిస్తున్న గరుకు స్తంభాలు

బాల్య వివాహాలు నేరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ఈశ్వరిరెడ్డి

చీరాల రూరల్: మైనార్టీ తీరని బాల, బాలికలకు వివాహాలు చేయడం నేరమని, చట్టాన్ని అతిక్రమించి అలా చేస్తే తల్లి దండ్రులతో పాటు పెద్దలు కఠిన శిక్షలకు గురవుతారని చీరాల బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి, న్యాయవాది జీకే ఈశ్వరి రెడ్డి హెచ్చరించారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో బుధవారం బైపాస్ రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ అనే నినాదాన్ని గ్రామగ్రామాన తెలియజేయాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. అందులో భాగంగానే ప్రతి విద్యార్థిని, విద్యార్థికి తెలియజేసి వారిని చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. అలానే ఒకచోట చదువుకునే విద్యార్థులు అక్క చెల్లెళ్లు, అన్న దమ్ముల మాదిరిగా కలిసిమెలిసి ఉంటూ ర్యాగింగ్‌ను పారదోలాలని సూచించారు. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. సైబర్ నేరాలు వంటివాటి గురించి అవగాహన కల్పించారు. సదస్సులో న్యాయవాది సురేంద్రబాబు, స్కూలు ప్రిన్సిపాల్ జె. సరళ, పారా లీగల్ వలంటీర్ జె. సాయికృష్ణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

యద్దనపూడి: పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు అన్నారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా యద్దనపూడి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డును పరిశీలించి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుకోవాలని, పెండింగ్ కేసులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరు, పోలీస్ స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఎస్. రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫెంగల్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి

బల్లికురవ: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయాధికారి ఎస్‌పీపీ కుమారి బుధవారం తెలిపారు. బోర్లకింద ఖరీఫ్‌లో సాగు చేసిన ఆహారధాన్యమైన వరిపంట కోత దశకు వచ్చిందని డిసెంబర్ 2వ తేదీ వరకు వరి కోతలు చేపట్టవద్దని కుమారి సూచించారు. అంబడిపూడి, ముక్తేశ్వరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోవద్దని వివరించారు.

పాఠశాలకు కుర్చీల అందజేత

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అళహరి వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు రోటరీ సభ్యుడు హరిప్రసాద్ సౌజన్యంతో అద్దంకిలోని గాజులపాలెం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన కుర్చీలు, స్టీల్ వాటర్ క్యాన్, అందజేశారు. రోటరీ తరపున పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునిస్తున్న హరిప్రసాద్‌ను రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అభినందించారు. కార్యక్రమంలో సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి


ఐక్య కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల రూరల్: క్రిస్మస్ పండుగ పర్వ దినాల్లో ప్రజలందరూ క్రీస్తువలే శాంతిని వర్థిల్లచేసి సుఖ సంతోషాలతో గడపాలని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. చీరాల నియోజకవర్గ పాస్టర్స్ అండ్ ఇవాంజిలిస్ట్స్ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్లో ఐక్య కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ క్రిస్మస్ నెల ప్రారంభమైనందున అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారని ప్రజలు రాగ ద్వేషాలు విడనాడి ప్రభువైన ఏసుక్రీస్తు చాటిచెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ ఉండాలని సూచించారు. ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ మోపర్తి జాన్ దేవుని వాక్య సందేశం అందించారు. పాస్టర్స్ గౌరవాధ్యక్షుడు బి. అలెక్స్, అధ్యక్షుడు రెవరెండ్ పి. రత్నరాజు, పాస్టర్లు ఎస్. యేసుదాసు, పి. వసంతరావు, ప్రభాకరరావు, ఐ. జయకుమార్, జి. యేసురత్నం, నియోజవర్గ టీడీపీ పరిశీలకులు ఉమామహేశ్వరరావు, తాడివలస దేవరాజు, గుమ్మడి ఏసురత్నం, గూడూరి శివరామప్రసాద్, కౌన్సిలర్లు ఎస్.సత్యానందం, ఉల్లిపాయల సుబ్బయ్య, మల్లెల బుల్లిబాబు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం ఎమ్మెల్యే కొండయ్య చేతులు మీదుగా పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కేకు కటింగ్ చేసి క్రీస్తు రాకను కాంక్షిస్తు క్యాండిల్ సర్వీసు నిర్వహించారు.

అద్దంకిలో మెగా జాబ్‌మేళా రేపు

అద్దంకి రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సహిల్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఏయూ, ఐసీఐసీ బ్యాంకులు, అపోలో టయర్స్ వంటి ప్రయివేటు కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమా, పీజీ వరకు చదువుకున్న 18-30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలతో, పాస్‌పోర్టు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871 సంప్రదించాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి

దగ్గుబాడు (కారంచేడు): మెట్ట పైర్లుగా ఉన్న పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలుగా ఉన్న శనగ, మినుము, పచ్చపెసలు, నల్లపెసలు, జొన్న, మొక్కజొన్న, కంది పంటలపై దృష్టి పెట్టాలని పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్. మోహనరావు అన్నారు. స్వర్ణపాలెం, దగ్గుబాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీమా యోజన ప్రీమియం చెల్లించాలి

యద్దనపూడి: మండలంలోని యద్దనపూడి, యనమదలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎన్. మేరమ్మ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. ఇన్సూరెన్స్ కోసం రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌లో ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఆఖరు తేదీ డిసెంబరు 31 అని, శనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, వేరుశనగ పంటలకు డిసెంబరు 15 వతేదీ తుది గడువు అని తెలిపారు. గ్రామ సర్పంచ్, వ్యవసాయ సహాయకులు పి. నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: వరిసాగు చేసే పొలాల్లో ఉల్లికోడు, దోమపోటు అధికంగా ఉందని వాటి నివారణకు రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాధికారి సుమతి పేర్కొన్నారు. మండలంలోని విజయనగర్ కాలనీ, ఈపురుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వరి సాగుచేసే రైతులు పీఎంఎఫ్‌బీ పథకం కింద రూ. 126 చెల్లించి బీమా సౌకర్యాన్ని పొందాలని సూచించారు. గ్రామ వీఏలు శ్రావ్య, ఆఫియా, ధీరజ్ పాల్గొన్నారు.

పూలసాగు చేపట్టండి

అద్దంకి రూరల్: పూల సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి అన్నారు. బుధవారం ధేనువుకొండ, గోపాల పురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బంతి, చామంతి, రోజ, మల్లె, సంపంగి పూలసాగుకు ఎకరాకు రూ. 6400, ఉద్యాన పంటల్లో మల్చింగ్ పేపర్ వేసుకొనేందుకు హెక్టారుకు 16 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి కె. వెంకటకృష్ణ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.